క్లుప్తంగా

మట్టి పాత్రల్లోనే దీపాలు వెలిగించాలి



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల: దీపావళి సందర్భంగా పట్టణ ప్రజలు మట్టి పాత్రల్లోనే దీపాలు వెలిగించాలని మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ అన్నారు. బుధవారం పట్టణంలో స్వచ్ఛ దివాళి శుభ్ దివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి సమాఖ్య సభ్యులు మట్టితో తయారు చేసిన దీపాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా కమిషనర్ పరిశీలించి వారిని అభినందించారు. కార్యక్రమంలో గణపతి సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్

రాయికల్: పట్టణంలోని 3–6 ఏళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నుంచి నాణ్యమైన పోషక పదార్థాలు అందిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మిట్టపల్లి పద్మ, ఆయా సుభద్ర పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న ఆర్‌ఎంపీ

సారంగాపూర్: మండల కేంద్రంలో బుధవారం దీర్ఘకాలిక వ్యాధులపై వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీసీతారామాలయ ఆవరణలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ గంగాధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది రానీయొద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో

మల్లాపూర్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వ్యవసాయ విస్తరణ అధికారి నవిత అన్నారు. మండలంలోని మొగిలిపేటలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్యాక్స్ సీఈవో రాజేశ్వర్‌రెడ్డి, రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను నిర్వాహకులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నా. ధాన్యం రవాణా కోసం లారీల కొరత లేకుండా, హామాలీలతో ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించడం హర్షణీయమని సాతారం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సాతారంలో ఎన్‌ఆర్‌ఐ విద్యాధర్‌రావు–సుహాసిని దంపతులు వీఎస్‌జీ అసిస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20 వేల విలువగల జిరాక్స్ ప్రింటర్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాధర్‌రావు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాడని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ మైదాం రాజరెడ్డి, వైస్ చైర్మన్ బల్సురెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలికలకు కరాటే శిక్షణ

- జిల్లాలో 122 పాఠశాలల ఎంపిక
- జిల్లాకు రూ.1.83 లక్షలు మంజూరు
- మూడు నెలలపాటు శిక్షణ



సుద్దపల్లి పాఠశాలలో కరాటే శిక్షణ పొందుతున్న బాలికలు

పెగడపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్షరాష్ట్ర పథక సంచాలకుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంటి నుంచి బయట అడుగుపెట్టిన మహిళలు, బాలికలకు తిరిగి వచ్చేవరకు రక్షణ కరువైంది. ప్రేమ పేరిట, ఇతరత్రా వేధింపులకు పాల్పడుతుండగా పలువురు బాలికలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పరిస్థితిని గమనించి బాలికలకు పూర్తిస్థాయిలో ఆత్మరక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి, కరాటే శిక్షణనిస్తున్నాయి. జగిత్యాల జిల్లాలో 122 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, రూ.1.83 లక్షలు మంజూరు చేశారు. మూడు నెలలపాటు రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్ పేరిట శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

వారానికి మూడు తరగతులు

ఎంపిక చేసిన పాఠశాలల్లో మూడు నెలలపాటు ఆత్మరక్షణ విద్యపై శిక్షణనిస్తారు. శిక్షకులకు నెలకు రూ.5 వేల చొప్పున పారితోషికం ఇవ్వనున్నారు. పాఠశాలల పనివేళల్లోనే కరాటే నేర్పిస్తారు. వారానికి 3 చొప్పున నెలకు 12 తరగతులు నిర్వహిస్తారు. ఇందుకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులదే. వ్యాయామ ఉపాధ్యాయులు, లేదా ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో శిక్షణ తరగతులు కొనసాగుతాయి. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు బాలికలే స్వయంగా ప్రతిఘటించడం, ప్రమాదం నుంచి బయట పడేలా మెలకువలు నేర్పిస్తారు. కరాటే, కుంగ్‌ఫూ, జూడో తదితర అంశాలపై శిక్షణనిస్తూ వాటి ప్రాధాన్యత వివరించనున్నారు.

ధైర్యం పెరుగుతుంది



మేము కరాటే తప్పనిసరిగా నేర్చుకుంటాం. ఇందులో శిక్షణ పొందడం వల్ల మాలో ధైర్యం పెరుగుతుంది. ఆపద సమయంలో రక్షణగా ఉపయోగపడుతుంది.

– కీర్తన, ఏడో తరగతి, సుద్దపల్లి ఉన్నత పాఠశాల

రక్షణగా ఉంటుంది



కరాటే నేర్చుకుంటే మాకు అనుకోని పరిస్థితులను ఎదుర్కొనే శక్తి వస్తుంది. ఈ శిక్షణ తరగతులు జీవితంలో ఎంతగానో ఉపయోగపడుతాయి. క్రమశిక్షణతో నేర్చుకుంటాం.

– అక్షర తొమ్మిదో తరగతి, కేజీబీవీ, పెగడపల్లి

ప్రణాళిక రూపొందించాం



ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం బాలికలకు కరాటే నేర్పించేందుకు ప్రణాళిక రూపొందించాం. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యా బోధనకు ఇబ్బంది కలగకుండా త్వరలోనే తరగతులు ప్రారంభిస్తాం.

– జగన్‌మోహన్‌రెడ్డి, డీఈవో



జగిత్యాల మండలం గుల్లపేట కేంద్రంలో ధాన్యం రాశులు



రాయికల్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం

ప్రారంభమే.. కొనుగోళ్లేవీ?

జగిత్యాలరూరల్/రాయికల్: రైతులు ధాన్యం విక్రయించడానికి జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఇంత వరకు కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో రైతులు ధాన్యం కొనుగోలు సెంటర్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగిత్యాల రూరల్ మండలంలో 18 ఐకేపీ సెంటర్లు, అర్బన్ మండలంలో 4 సెంటర్లను ఇప్పటికే ప్రారంభించారు. కానీ ధాన్యం కొనుగోళ్లు మాత్రం జరగడం లేదు. గత 10 రోజులుగా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి టూర్పాల పట్టి ఆరబెడుతున్నారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై అధికారులను వివరణ కోరగా ధాన్యం కొనుగోలుకు అంతా సిద్ధం చేశామని, ధాన్యం తేమ రాగానే కొనుగోళ్లు చేస్తామని తెలిపారు.

రాయికల్ మండలంలో..

రాయికల్ పట్టణంతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

విశ్వరూప మహాసభకు తరలిరావాలి



కోరుట్లలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోరుట్ల: ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభకు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీ ఎస్ నాయకులు అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్సీ ఉపకులాలకు అన్ని రంగాల్లో జనాభా దామాషా ప్రకారం సమాన వాటా పంపిణీ జరగాలంటే ఎస్సీ వర్గీకరణతోనే సమన్యాయం జరుగుతుందన్నారు. ఈ సభకు భారీగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ మండల ఇన్‌చార్జి కంటాల శ్రీనివాస్, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం, చెట్‌పెల్లి లక్ష్మణ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: మాదిగల విశ్వరూప మహాసభకు భారీగా తరలిరావాలని మహాజన సోషలిస్టు నియోజకవర్గ ఇన్‌చార్జి అరికెల్ల సతీశ్ పిలుపునిచ్చాడు. నియోజకవర్గ కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ పట్టణ ఇన్‌చార్జి పులి ప్రేమిత్, మండల కో–కన్వీనర్ చెందోలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశ్వరూప మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు జిలపెల్లి శంకర్, దూడ లక్ష్మణ్, రవికుమార్, సుధాకర్, నరేశ్ తదితరులున్నారు.

బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా శ్రీనివాస్



నియామకం పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

మెట్‌పల్లిరూరల్: బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్(ఓబీసీ) కన్వీనర్‌గా మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన మారంపెల్లి శ్రీనివాస్ నియామమయ్యారు. నియామక పత్రాన్ని బుధవారం అందుకున్నారు. శ్రీనివాస్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్‌గా మనోహర్



గొల్లపల్లి: ఎన్‌ఎస్‌యూఐ ధర్మపురి నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్‌గా గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన శ్రీపతుల మనోహర్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సాదుల విజయ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌ఎస్‌యూఐ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు కబ్జాకు యత్నం.. అడ్డుకున్న స్థానికులు



రోడ్డు కబ్జా చేస్తుండగా అడ్డుకుంటున్న స్థానికులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లోని అచ్చుబండ పోచమ్మ సమీపంలో రోడ్డును కొందరు ఆక్రమించాలని చూడగా స్థానికులు అడ్డుకున్నారు. అయితే ఆ ప్రాంతంలో బూస శ్రీనివాస్ అనే వ్యక్తికి మూడెకరాల భూమి ఉండగా అమ్ముకున్నాడు. అదే ప్రాంతంలో రాజు అనే వ్యక్తికి సైతం భూమి ఉంది. అక్కడ గతంలో కొన్నేళ్లుగా ఉన్న రోడ్డును చదును చేసి అందులో ఉన్న చెట్లను శ్రీనివాస్ ప్రొక్లెయిన్ సహాయంతో కొట్టేయడంతో ఆ సమీపంలోని కాలనీవాసులు అడ్డుకున్నారు. ఇది రోడ్డు అని, దీనిని ఎందుకు చదును చేస్తున్నావని, చెట్లు ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించారు. ఇది నా పట్టా భూమి అని, నేను అందుకే చేస్తున్నానని అనడంతో వాగ్వివాదానికి దిగారు. వెంటనే కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకుని అందరికి సంబంధించిన డాక్యుమెంట్స్ తీసుకుని వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

ధర్మపురిలో ప్రచార హోరు..



ప్రచారం చేస్తున్న నాయకులు

ధర్మపురి: రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ధర్మపురి పట్టణంలో బుధవారం ప్రచారాలు హోరెత్తాయి. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా బీజేపీ, బీఎస్పీ పార్టీల ఆధ్వర్యంలో ప్రచారాలను ముమ్మరం చేశారు. నందీ కూడలి నుండి గాంధీ కూడలి, అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీలు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ప్రచారంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ ప్రజావంచక పార్టీలు



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న యువకులు

జగిత్యాల: కాంగ్రెస్, బీజేపీలవి ప్రజావంచక ప్రభుత్వాలని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ, సంపద సృష్టించిన ప్రభుత్వమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలతో దేశంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. నాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పెన్షనర్లతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. మరోసారి అధికారంలోకి రాగానే పీఆర్సీ పెంచుతామని తెలిపారు. హరి అశోక్‌కుమార్, బొల్లం విజయ్ పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులు వ్యాక్సిన్ వేయించుకోవాలి



రిజిస్టర్లను పరిశీలిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో

రాయికల్: గ్రామీణప్రాంతాల్లోని గర్భిణులు, చిన్నారులు వ్యాక్సిన్ తప్పకుండా వేయించుకోవాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాయికల్ మండలం బోర్నపల్లి సబ్‌సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ సెంటర్ పరిధిలో ఉన్న గ్రామాల్లోని గర్భిణులు, చిన్నారులు తప్పనిసరిగా సమయానుసారంగా వ్యాక్సిన్ టీకాలు వేయించుకోవాలని సూచించారు. గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం, క్రమం తప్పకుండా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎప్పటికప్పుడు ఇంటింటికి సర్వే నిర్వహిస్తూ రోగుల వివరాలు సేకరించాలన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన నిరుపేద తాళ్ల సుధాకర్ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ, మతిస్థిమితం కోల్పోవడంతో వైద్య ఖర్చులకు తెలంగాణ యువ చైతన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.21వేలు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు. సుధాకర్ శరీరంలో అవయవాలు పాడైపోయి వైద్య ఖర్చులకు డబ్బులు లేక దాతల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ యువ చైతన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సుధాకర్ ఇంటికి వెళ్లి రూ.21,000లతోపాటు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు సుధాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో బొజ్జ నర్సయ్య గుర్రం శ్రీధర్, కరబూజ నర్సయ్య, మ్యాదరి లవన్, పొనగంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



ధాన్యం పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలోధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇన్నాళ్లు క్వింటాలుకు అదనంగా 4 కిలోలు తూకం వేసి మోసం చేసిందని పలువురు రైతులు ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. ఆయన వెంట గ్రామ ఆలయ కమిటీ చైర్మన్ పాల్తెపు గంగారాం, సింగిల్‌విండో డైరెక్టర్ మార్గం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పుప్పాల బొర్రన్న, కారపు గంగాధర్ ఉన్నారు.

తుల ఉమకు నాయకుల అభినందన

మేడిపల్లి: వేములవాడ బీజేపీ అభ్యర్థిగా తుల ఉమకు టికెట్ ఖరారు కావడంతో భీమారం మండల యాదవ సంఘం నాయకులు బుధవారం ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రెబ్బస్ మల్లయ్య, మేడిపల్లి మండల అధ్యక్షుడు ఆదె రమేశ్ నాయకులు బీనవేని ముకేశ్, బీనవేని రెడ్డి, గాజర్ల రాజం పాల్గొన్నారు. అలాగే బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తొగరి లక్ష్మీపతి తన సహచరులతో కలిసి వచ్చి ఉమకు మద్దతు పలికారు. ఆయన వెంట హనుమండ్లు, నాగెల్లి మహేశ్,, రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



మల్యాల: మల్యాల, కొండగట్టు, తాటిపల్లి, తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ సీహెచ్ బాలలింగం తెలిపారు. వినియోగదారుల సహకరించాలని కోరారు.

చిత్ర కథ — నిరుపయోగంగా రక్షిత మంచినీటి పథకం



సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలో దాదాపు 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన భారీ రక్షిత మంచినీటి పథకం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు సమీపంలో రూ. 2 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ భారీ రక్షిత మంచినీటి పథకం బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని పలు గ్రామాల ప్రజలకు ఫ్లోరైడ్ రహిత మంచినీటిని అందించాలన్న సంకల్పంతో దీనిని ఏర్పాటు చేశారు. మిషన్‌భగీరథ పథకం ప్రారంభమైన తర్వాత దీనిని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇందులో ప్రస్తుతం ఫిల్టర్‌బెడ్‌లు, నీటి ట్యాంకులు, సంపులు, పైపులైన్లు పూర్తి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ పథకంలో ఫిల్టర్‌బెడ్‌లో ఇసుక ద్వారా తాగునీటిని ఫిల్టర్ చేసి శుద్ధజలం అందించారు. ప్రస్తుతం బీర్‌పూర్ మండలంలోని చాలా గ్రామాలకు మిషన్‌భగీరథ రు ఆశించిన మేర అందడం లేదు. బీర్‌పూర్ శివారుల్లో ఏర్పాటుచేసిన ఈ పథకానికి కేవలం రూ. 15 లక్షల వరకు వెచ్చిస్తే ఈ పథకం పునఃప్రారంభించవచ్చని, దీని ద్వారా మిషన్‌భగీరథ నీరు సరఫరా కాని రోజు ప్రత్యామ్నాయంగా దీని ద్వారా శుద్ధజలాన్ని సరఫరా చేయవచ్చని మండల ప్రజలు కోరుతున్నారు.